క్లుప్తంగా

జేసీఐ నిజామాబాద్ స్ఫూర్తి అధ్యక్షురాలిగా వజ్జా నవనీత

ఖలీల్‌వాడి: నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జేసీఐ నిజామాబాద్ స్ఫూర్తి- 2025 అధ్యక్షురాలిగా వజ్జా నవనీత ఎంపికైనట్లు జోన్-12 అధ్యక్షులు ఉటుకూరి చతుర్వేది మంగళవారం ప్రకటించారు. జేసీఐ స్ఫూర్తి-2025ను మరింత బలోపేతం చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ శ్రీనివాస్, దిలీప్ మల్ల, లఖిషెట్టి మహేష్, వజ్జా మహేందర్, నయన్, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించి జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారాపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గిరిరాజ్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగాన్ని కేసీఆర్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు. యూనివర్సిటీలకు అధికంగా నిధులు కేటాయించాలన్నారు. నాయకులు ప్రిన్స్, రాహుల్, మహేష్, రాజు, నిఖిల్, వాసు, అక్షయ్, వంశీ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాల ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే ఎస్సీ వర్గీకరణ



నిజామాబాద్‌నాగారం: తెలంగాణలో మాల ప్రజాప్రతినిధులు ఎస్సీ వర్గీకరణని అడ్డుకోలేకపోయారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ కో-కన్వీనర్ ఎడ్ల నాగరాజు విమర్శించారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పులాంగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లు పాస్ కావడం తెలంగాణలోని మాలలందరికి చీకటి రోజు అన్నారు. ఎస్సీ జనాభా ప్రాతిపదికన 18 శాతం రిజర్వేషన్ సాధించడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. నాయకులు చందు, తదితరులు పాల్గొన్నారు,.

'డీఏలు, పీఆర్సీ ఇవ్వలేమనడం సమంజసం కాదు'

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడిన నాలుగు వాయిదాల డీఏను, జులై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని అడగొద్దని, అవి కావాలంటే నెలనెలా జీతాలే ఇవ్వలేమని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించటాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు ఓ ప్రకటనలో విమర్శించారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని వారికి న్యాయంగా రావాల్సిన బకాయిలను లేదా వారు దాచుకున్న సొమ్మును వారికి తిరిగి చెల్లించాలని మాత్రమే అడుగుతున్నామని పేర్కొన్నారు. ఇదే విధమైన ధోరణి కొనసాగితే ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనై పోరాటాలకు దారి తీసే అవకాశం ఉందన్నారు.

పరిశోధన పద్ధతులపై సెమినార్

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్గత నాణ్యత నిర్ధారణ విభాగం సంయుక్తంగా పరిశోధన పద్ధతులు, సమాచార వ్యక్తీకరణ పద్ధతులు అనే అంశాలపై సెమినార్ నిర్వహించారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు బోధన అధ్యాపక బృందాన్ని ఉద్దేశించి ఈ సెమినార్ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పరిశోధన పద్ధతులకు సంబంధించిన ప్రాథమిక అంశాల గురించి వివరించారు. బాసరలోని ఆర్జీయూకేటీ యూనివర్సిటీ సహాయక ఆచార్యులు డాక్టర్ విఠల్ తదితరులు పరిశోధన పత్ర లేఖ పద్ధతులు ఆవిష్కరించారు.

ప్రేమ్‌లాల్‌కు గురుశ్రేష్ఠ పురస్కారం



నిజామాబాద్ రూరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను రచయిత ప్రేమ్‌లాల్‌కు విశిష్ట గురు శ్రేష్ఠ పురస్కారం అందజేసినట్లు రావు ఆర్గనైజేషన్ కన్వీనర్ అశోక్ రెడ్డి తెలిపారు. పురస్కారం దక్కడం పట్ల తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శేఖర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు.

పౌర సేవలపై ఆరా..

నేటి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్వే

- ఐదు రోజుల పాటు కేంద్రబృందం పర్యటన
- నగరంలో 5 బృందాలతో సర్వే



బల్దియా కార్యాలయం



స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యం తెలుపుతూ నగరంలోని టాయిలెట్లపై వేసిన పెయింటింగ్

నిజామాబాద్ సిటీ: దేశవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులు ఆరా తీయనున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని నగరవాసులకు అందుతున్న సేవలు, సర్వీసులు, పనుల్లో నాణ్యత వంటి పలు అంశాలను రహస్యంగా సర్వే చేయనున్నారు. మున్సిపల్ అధికారుల సమన్వయం లేకుండా నేరుగా స్థానికులను కలిసి వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. తెలుసుకున్న వివరాల నివేదికను కేంద్రానికి ఇవ్వనున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2025 పేరుతో సర్వే నిర్వహించనున్నారు. నిజామాబాద్ నగరంలోని అన్ని డివిజన్లలో 5 రోజుల పాటు 5 బృందాలు సర్వే చేపట్టనున్నాయి.

సేవలను బట్టి ర్యాంక్..

ప్రజలకు అందుతున్న సేవలో పాటు పలు అంశాలను సర్వే చేసి తద్వారా దేశంలోని మున్సిపాలిటీలకు కేంద్రం ర్యాంక్ ఇవ్వనుంది. ఈ ర్యాంకింగ్‌ను బట్టి కేంద్ర నిధుల మంజూరీ, ప్రత్యేక నిధులు మంజూరీ వంటి అంశాలు ఆధారపడి ఉంటాయి. ఈ సర్వే కంటే ముందుగా కేంద్ర ప్రభుత్వం ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంది. దాని కోసం ప్రత్యేకంగా యాప్‌ను ఏర్పాటు చేసింది.

పరిశీలించే అంశాలు..

స్వచ్ఛ సర్వేక్షణ్-2025 సర్వేలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, డంపింగ్‌యార్డు, శ్మశానవాటికలు, పార్కులు, జనావాసాలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలు, పాఠశాలలు, పార్కులు, గార్డెన్లు, ప్రజా రవాణా వ్యవస్థ, తడి-పొడి చెత్త వేరు చేసే విధానం, చెత్తనుంచి ప్లాస్టిక్ వేరు చేసే విధానం, చెత్త నుంచి ఎరువులు తయారుచేసే ప్రక్రియ, కెనాల్స్‌లో చెత్త శుద్ధి వంటి పలు అంశాలను పరిశీలించనున్నారు.

ఇది కేంద్ర ప్రభుత్వ సర్వే



స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేను కేంద్రం నిర్వహిస్తోంది. ఈ సర్వేతో బల్దియా అధికారులకు ప్రమేయం లేదు. వారు స్వచ్ఛందంగా సర్వేను నిర్వహిస్తారు. వారు వెళ్లాల్సిన లోకేషన్, ఇతర ఏమైనా సాంకేతిక అంశాలు కోరితే మేం అందిస్తాం. దేశవ్యాప్తంగా కార్పొరేషన్లలో ప్రజలకు అందుతున్న సేవలపై సర్వే నిర్వహిస్తున్నారు.

– రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్

కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు అర్థరహితం



సిరికొండలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

సిరికొండ/ధర్పల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, ధర్పల్లి బీజేపీ మండలాధ్యక్షుడు జీర్ర మహిపాల్ మహిపాల్ యాదవ్ అన్నారు. మంగళవారం వారు సిరికొండ, ధర్పల్లి మండల కేంద్రాల్లో వేర్వేరుగా మాట్లాడారు. అభివృద్ధిపై చర్చకు పిలిస్తే రాకుండా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తున్నారని, జిల్లాలో నాలుగు రైల్వే బ్రిడ్జిలు కట్టిస్తున్నాడని, పసుపు బోర్డును ఏర్పాటు చేయించారని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు ఎండిపోతుంటే స్పందించకుండా బీజేపీపై విమర్శలు చేయడం మీ చేతకానితనానికి నిదర్శనమన్నారు.

ఇరిగేషన్ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు



మోపాల్: నిజాంసాగర్ కెనాల్ ఇరిగేషన్ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు సూచించారు. మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో ఇరిగేషన్ స్థలంలో శ్మశాన వాటిక నిర్మాణంపై ఓ వర్గం వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇరువర్గాలు ఒకరినొకరు దూషణలు చేసుకునే పరిస్థితి రావడంతో తహసీల్దార్ రామేశ్వర్, ఏఈ శ్రీనివాస్ సముదాయించారు. వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామని తెలపడంతో ఇరువర్గాలు వెనుతిరిగాయి.

ఏజీఎల్ ఫీడర్‌కు బ్రేకర్ బిగింపు



డిచ్‌పల్లి: దూస్‌గాంలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వ్యవసాయ సంబంధిత (ఏజీఎల్) ఫీడర్‌కు ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను మంగళవారం డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్ జాడే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.10 లక్షల వ్యయంతో నడిమితండా పరిధిలోని ఏజీఎల్ ఫీడర్‌కు బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బ్రేకర్ ద్వారా పంటలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఏడీఈ శ్రీనివాస్, ఏఈ గంగారాం, లైన్‌మెన్ స్వామిదాస్, జేఎల్ఎం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



మోపాల్‌లో మాట్లాడుతున్న బోర్గం శ్రీనివాస్



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, కాంగ్రెస్ నేతలు

మోపాల్/డిచ్‌పల్లి: ఎమ్మెల్యే భూపతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ బోర్గం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ హెచ్చరించారు. మంగళవారం వారు మోపాల్, డిచ్‌పల్లి మండల కేంద్రాల్లో వేర్వేరుగా మాట్లాడారు. 15 నెలల్లో రూ.205 కోట్లతో రూరల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు మరో రూ.200 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. నియోజక వర్గంలో చేస్తున్న అభివృద్ధి దినేష్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పదవిని వదులుకున్న భూపతిరెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారికి లేదన్నారు. 'ఇటుక బట్టీల ఎమ్మెల్యే' అని సంబోధిస్తూ బట్టీల వద్ద చర్చ పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఏంటని మండిపడ్డారు. దినేష్ కుమార్‌కు మతితప్పి పిల్లచేష్టలకు పాల్పడుతూ అర్థరహిత విమర్శలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మాట్లాడే ముందు స్థాయి, వయసు, పదవిని గౌరవించాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

నిజామాబాద్‌నాగారం: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్చుతూ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఇందూరు పట్టణ ఆర్యవైశ్య సంఘ అనుబంధ సంస్థలు, గల్లీ సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా ఆందోళన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం అంటే యావత్ ఆర్యవైశ్య సమాజాన్ని అవమానించడమే అవుతుందన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి గొప్ప నాయకుడని, ఆయన పేరు ఉస్మానియా యూనివర్సిటీకి పెట్టాలని కోరారు. నేతలు ఇల్లెందుల ప్రభాకర్, ఆగమయ్య గజవాడ, పార్శి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులగుట్టను సందర్శించిన సిర్పూర్ విద్యార్థులు



మోపాల్: సిర్పూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం సిద్ధులగుట్టను సందర్శించారు. విద్యార్థులకు పరిసరాల విజ్ఞానంతో పాటు ప్రకృతి గురించి వివరిస్తూ ఆలయ విశేషాలను ప్రధానోపాధ్యాయురాలు నాగమణి తెలిపారు. ఉపాధ్యాయులు రాము, వసంత, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవల డిజిటలైజేషన్‌పై శిక్షణ



నిజామాబాద్‌నాగారం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందిస్తున్న సేవలను డిజిటలైజేషన్ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి రాజశ్రీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రత్యేకంగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీలలో అందిస్తున్న సేవలు నూతన డిజిటలైజేషన్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

బీసీ బిల్లు ఆమోదం పట్ల హర్షం

సిరికొండ: అసెంబ్లీలో బీసీ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బండారి నరేష్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీలకు మద్దతుగా ఉందని చెప్పడానికి రిజర్వేషన్ల పెంపు కార్యక్రమమే నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేయడం అభినందనీయమన్నారు.

కల్యాణ తలంబ్రాల బుకింగ్ ప్రారంభం



బోధన్: భద్రాచలం సీతారాములోరి కల్యాణ తలంబ్రాలు భక్తుల చెంతకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు బుకింగ్ ప్రారంభించారు. మంగళవారం బోధన్ ఆర్టీసీ డిపోలో డీఎం శ్రీనివాస్ బుకింగ్ ప్రారంభించి వివరాలు వెల్లడించారు. తలంబ్రాలు అవసరం ఉన్న భక్తులు రూ.151 చెల్లిస్తే ఇంటి వద్దకు వచ్చి అందిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం 9000093214(బోధన్), 9989137251 (ఎడపల్లి), 9553055835 (సాలూర), 8520929896(వర్ని), 8374542876(రుద్రూర్), 9346793293(కోటగిరి) నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కనుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

డిచ్‌పల్లి: మండలంలోని నర్సింగాపూర్(కొత్తపేట్) గ్రామంలో కొలువైన లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం రథహోమం, రథబలి, ఆలయం నుంచి గ్రామం వరకు రథయాత్ర, జాతర వేడుకలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తొండకూర్ నర్సయ్య, చిన్న భూమయ్య, నడిపి గంగారాం, పెద్ద నర్సయ్య, సాయిరాం, వీడీసీ సభ్యులు మాజీ సర్పంచ్ నల్లవెల్లి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కవిత పోరాట ఫలితమే బీసీ బిల్లు



నిజామాబాద్‌నాగారం: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితంగానే బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి అన్నారు. మంగళవారం అవంతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. విద్య, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుందని వాదించినట్లు తెలిపారు. వేర్వేరు బిల్లుల కోసం ఎమ్మెల్సీ కవిత పోరాటం చేశారని గుర్తు చేశారు. నాయకులు లక్ష్మీనారాయణ భరద్వాజ్, డాక్టర్ పులిజైపాల్, పంచరెడ్డి మురళి, తదితరులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయం, మారుతి మందిరాలలో మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తుల ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. చక్రేశ్వర ఆలయంలో హుండీ ఆదాయం రూ.3,02,699లు, మారుతి మందిర్‌లో హుండీ ఆదాయం రూ.30,660 వచ్చినట్లు ఈవో రాములు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కమల, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	82,887	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సుడ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	10	20
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	50	75
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దిల్‌రూబా(తెలుగు)-11.00, 4.35, 7.30, 10.25 -ఛావా(హిందీ)-1.40
స్క్రీన్-2	యుగానికి ఒక్కడు(తెలుగు)-11.00, 4.40 కోర్ట్(తెలుగు)-1.45, 7.35, 10.30
స్క్రీన్-3	ఆఫీసర్ ఆన్ డ్యూటీ (తెలుగు)-1.30, 7.30 -ఛావా(తెలుగు)-4.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(తెలుగు)-10.00, 4.15 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.20 కోర్ట్(తెలుగు)-7.35, 10.40
స్క్రీన్-2	కోర్ట్(తెలుగు)-10.00, 4.25 ఛావా(తెలుగు)-1.05, 7.30 ఛావా(హిందీ)-10.50
స్క్రీన్-3	ఛావా(హిందీ)-10.30, 1.50 ల్యాంప్(తెలుగు)-5.10 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.35 యుగానికి ఒక్కడు(తెలుగు)-10.45
స్క్రీన్ -4	దిల్‌రూబా(తెలుగు)-10.15, 4.10, 7.20, 10.30 1000 వాలా(తెలుగు)-1.25
లలితామహల్	కోర్ట్ (తెలుగు)
దేవి	దిల్‌రూబా(తెలుగు)
నటరాజ్	యుగానికి ఒక్కడు (తెలుగు)
విజయ్	ఛావా (తెలుగు)

సమయపాలన పాటించాలి

నవీపేట/పెర్కిట్(ఆర్మూర్): వైద్యశాఖ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి బస్తీ దవాఖానాను, నవీపేట మండలంలోని బినోల పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. అలాగే సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు.

విద్యుత్ ప్రమాదాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్: విద్యుత్ ప్రమాదాల పట్ల ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ రాపెల్లి రవీందర్ అన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వారు తప్పకుండా ఈ జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

- సెక్షన్ ఇన్‌చార్జి ప్రతిరోజూ 15 నిమిషాలు పనికి ముందు భద్రత గురించి సిబ్బందితో చర్చించాలి.
- అనుమతి కలిగిన అధికారి మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలి
- ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచాలి.
- హెచ్‌టీ/ఎల్‌టీ లైన్ల పనిని ప్రారంభించే ముందు చేతి తొడుగులు, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్, వోల్టేజ్ డిటెక్టర్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- లైన్ సమీపంలో వోల్టేజ్ డిటెక్టర్‌ను ఉంచడం, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్‌ను తాకడం ద్వారా లైన్ డెడ్‌గా ఉందని నిర్ధారించుకోవాలి.
- సెక్షన్ ఆఫీసర్, సబ్ డివిజన్ ఆఫీసర్(ఏడీఈ) వద్ద బ్రేక్ డౌన్ల సమాచారం, నిర్వహణ పనులు చేసిన ఫీల్డ్ సిబ్బంది పేర్లు ఉండాలి.

ఎగ్జిబిషన్ ప్రారంభానికి భూమి పూజ



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో 42వ అఖిల భారత పారిశ్రామిక వ్యవసాయ ప్రదర్శన(ఎగ్జిబిషన్)కు సొసైటీ కార్యదర్శి బంటు రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు దాసరి నర్సింలు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ.. విజ్ఞానం కలిగించే ఎగ్జిబిషన్ ఏప్రిల్ 20 నుంచి జూన్ 5 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 64 స్టాల్స్‌తో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. లక్ష్మంరెడ్డి, రామచంద్రా రెడ్డి, భక్తవత్సల నాయుడు, ఆనంద్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.